క్లుప్తంగా

మంత్రికి శుభాకాంక్షలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

అనంతగిరి: నూతన సచివాలయంలో తనకు కేటాయించిన చాంబర్‌లో ఆదివారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ శర్మ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆసరా పింఛన్ల పంపిణీ

యాలాల: జుంటుపల్లిలో కొత్తగా మంజూరైన 9 మంది మహిళలకు ఆసరా పింఛన్లను సర్పంచ్ వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. గతంలో పింఛన్లు పొందే వృద్ధుల మరణంతో కుటుంబ సభ్యులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు వితంతు పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని సర్పంచ్ తెలిపారు. మూడు నెలలకు సంబంధించిన ఆసరా డబ్బులను లబ్ధిదారులకు అందజేసినట్లు ఆయన వెల్లడించారు.

24వ రోజుకు చేరిన దీక్ష



తట్టెపల్లిలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

పెద్దేముల్: తట్టెపల్లి మండలం కోసం మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 24వ రోజుకు చేరుకుంది. దీక్షలో ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నాయక్, సాధన సమితి సభ్యుడు ఇమ్రాన్, బక్కప్ప, సాజిద్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తట్టెపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు దీక్ష విరమించేది లేదని సభ్యులు తెలిపారు.

నిరుద్యోగ నిరసనకు కాంగ్రెస్ నాయకులు



ర్యాలీకి వెళ్లిన నాయకులు

కొడంగల్ రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షుడు,ఎంపీ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీకి కాంగ్రెస్ నేతలు తరలి వెళ్లారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు భారీ సంఖ్యలో వెళ్లారు.

బొడ్రాయి ఉత్సవాలకు విరాళం

దోమ: బాస్‌పల్లి గ్రామంలో జరిగే బొడ్రాయి ఉత్సవాలకు డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ఆదివారం రూ.51 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, కావటి శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కొడంగల్ రూరల్: శాంతినగర్ కాలనీలో దుర్గ అనే వ్యక్తి గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. దీంతో దహన సంస్కారాల నిమిత్తం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్ రూ.5 వేలు, కాలనీకి చెందిన నవాజొద్దీన్ రూ.2 వేలను ఆర్థిక సాయంగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

పార్టీ నేత విజయ్‌కుమార్



పార్టీ కండువా కప్పుతున్న విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్న చిల్కమర్రి ఉప సర్పంచ్‌తో పాటు పలువురు ఆదివారం డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులను విడుదల చేసి అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. గ్రామాలతో పాటు రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు.

విపత్తులతో రైతన్న విలవిల

అకాల వర్షాలతో అన్నదాతలు అల్లాడిపోతున్నారు. దెబ్బమీద దెబ్బకొడుతూ వరుణుడు కోలుకోలేని దెబ్బ తీస్తున్నాడు. నెల రోజుల క్రితం కురిసిన వానలకు పంటలు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కర్షకులకు.. వరుస వడగండ్లు కడగండ్లను మిగిల్చుతున్నాయి.

- అకాల వర్షాలతో ఆగమాగం
- కోలుకోలేని స్థితిలో కర్షకులు
- మొదటి పరిహారమే అందలేదు
- మరోసారి వర్షార్పణమైన పంటలు



ఎన్కేపల్లిలో పాడైన టమాట పంట

మోమిన్‌పేట: మోమిన్‌పేట పరిసర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల పడి వర్షం బీభత్సం సృష్టించింది. ఇప్పటికే ఆదుకునే వారికోసం ఎదురు చూస్తున్న రైతన్నలను.. మరింత దీనావస్థకు చేర్చి.. విలవిలలాడేలా చేసింది. కోళ్ల ఫారాలు, పశువుల పాకలు, రేకుల ఇళ్లు ఈదురు గాలులకు చెల్లా చెదురుకాగా.. నెల క్రితం కురిసిన వడగండ్లకు కూరగాయ, మొక్కజొన్న పంటలు, ఆరటి, బొప్పాయి, ఉల్లి పూర్తిగా నీటిపాలు అయ్యాయి. తిరిగి టమాట, మిర్చి, క్యాబేజీ, ఫ్లవర్ నాట్లు వేసుకున్న రైతులను మొన్నటి వర్షం నిండా ముంచెత్తింది. దీంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కాస్లాబాదు, రాళ్లగుడుపల్లి, మేకవనంపల్లి, లచ్చానాయక్ తండాల్లో కోతకు వచ్చిన వరి పంటలు వర్షార్పణం అయ్యాయి. నెల క్రితం కురిసిన వర్షాలకు ఉల్లి పూర్తిగా దెబ్బతిని.. ఒక్కో రైతు రూ.లక్షల్లో నష్టపోయారు. మిగిలిన కాస్త పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తరలించగా.. కూలీల కూలి కూడా రాలేదని పలువురు రైతులు వాపోగా.. మరికొందరు పొలంలోనే వదిలేశారు. వేసవిలో ఏ పంటను సాగు చేసినా అకాల వర్షాలు నిండా ముంచేస్తున్నాయని, గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం అందిస్తామన్న పరిహారం ఇంకా రైతులకు అందనేలేదు. మళ్లీ వర్షం కురిసి ఉన్న ఆశలను తుడిచిపెట్టుకుపోయిందని వాపోతున్నారు.

రెండు ఎకరాల్లో మిర్చి



గతంలో కురిసిన వర్షంతో టమాట, క్యాబేజీ, క్యాప్సికం పంటలు పూర్తిగా దెబ్బతిని నష్టపోయాము. తిరిగి నెల క్రితం మళ్లీ దున్ని మల్చింగ్ వేసి రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. పంట ఏపుగా వచ్చింది. మరలా వడగళ్ల వాన పడడంతో పంట పూర్తిగా కోల్పోయాను. సాగు కొరకు రూ.30వేలు పెట్టుబడి పెట్టా. – ప్రభాకర్‌రెడ్డి, రైతు, ఎన్కేపల్లి

మళ్లీ చిగురించాయి



ఇంతకు ముందు కురిసిన వర్షానికి బంతి కొమ్మలు విరిగి పోయాయి. మళ్లీ చిగురించి పూత బాగా వచ్చింది. వారం రోజుల్లో శుభకార్యాలు ఉండటంతో కోయాలనుకొన్నాను. ఈ లోపే కురిసిన వర్షంతో మొక్కలు విరిగి, పూలు రాలి పోయాయి. రూ.2లక్షల వరకు నష్టం వచ్చింది. ప్రభుత్వం ఆదుకోవాలి. – నర్సింహ్మారెడ్డి, రైతు, ఎన్కేపల్లి

ప్రయాణ ప్రాంగణం లేక ఇక్కట్లు

- చిన్న బస్‌షెల్టర్‌తో ప్రయాణికుల చింత
- వసతుల కల్పనపై దృష్టి సారించని అధికారులు, ప్రజాప్రతినిధులు



కోట్‌పల్లి మండల కేంద్రంలోని చిన్న బస్ షెల్టర్

బంట్వారం: ప్రయాణ ప్రాంగణం లేక ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కోట్‌పల్లి మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపట్టకపోవడంతో రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన చిన్నపాటి బస్ షెల్టరే దిక్కయింది. మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు కానీ.. తగిన అభివృద్ధి చేయడానికి అధికారులు, పాలకులు దృష్టి సారించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న బస్ షెల్టర్ ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా లేకపోవడంతో.. చాలా మంది హోటళ్లు, దుకాణాల వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.

సంత రోజు రద్దీ ఎక్కువ

మండల కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే సంతకు చుట్టు పక్కల గ్రామాల నుంచి అనేక మంది నిత్యావసర సరుకులు, కూరగాయల కొనుగోలుకు కోట్‌పల్లికి వస్తుంటారు. బస్ షెల్టర్ పక్కనే సంత ఉండడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రైవేటు వాహనాలు, చిరు వ్యాపారులు కూడా తోపుడు బండ్లను షెల్టర్ ముందే పెడుతుంటారు. దీంతో ప్రయాణికుల కష్టాలు మరింత పెరిగాయి.

మండలం ఏర్పాటుచేసినా..

కోట్‌పల్లి మండలం కొత్తగా ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు బస్టాండ్ నిర్మాణం ఊసేలేదు. ఆర్టీసీ అధికారులు కనీసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన దాఖలాలు కూడా లేవు. నిత్యం తాండూరు, వికారాబాద్, సంగారెడ్డి డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు కోట్‌పల్లికి వచ్చిపోతుండగా.. వివిధ పనుల నిమిత్తం అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చదువుపై దృష్టి సారించాలి

మండల విద్యాధికారి హరిశ్చందర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

దోమ: విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. ఆదివారం దిర్సంపల్లి పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. చదువుపై శ్రద్ధ చూపినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని, వేసవిలో కాలం వృథా చేయకుండా పిల్లలు ఇంటివద్ద చదువుకునేలా వారి తల్లిదండ్రులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంత, ఉపసర్పంచ్ శిరీష, స్కూల్ చైర్మన్లు తిరుపతి, నర్సింహులు, వైస్ చైర్మన్ అంజిలమ్మ, ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, వెంకటచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతకానికి మా ఫైల్ దొరకలేదా సారూ!



బషీరాబాద్: దీక్షలో కూర్చున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

బషీరాబాద్: 'తమను రెగ్యులరైజ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా మాట ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ సారూ.. కొత్త సచివాలయం ప్రారంభం సందర్భంగా ఆరు ఫైళ్లపై సంతకాలు పెట్టిన మీకు.. మా ఫైల్ కనిపించలేదా' అని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేశారు. మూడు రోజులుగా చేపట్టిన సమ్మెలో కార్యదర్శులు ఆదివారం నోటికి నల్లగుడ్డలు కట్టుకొని తాండూరులో జరిగిన మౌన దీక్షలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు. పంచాయతీలకు అవార్డులు వచ్చాయని చెబుతున్నారే తప్పా.. కార్యదర్శులు బాగా పనిచేశారు, వారికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అనిపించలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం దిగివచ్చేవరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పారు.

జేపీఎస్‌ల మౌన దీక్ష

తాండూరు రూరల్: తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె ఆదివారంతో మూడో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా తాండూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద మూతికి నల్లగుడ్డ కట్టుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు మౌన దీక్ష చేపట్టారు.

డిమాండ్లు నెరవేర్చాలి

ధారూరు: జూనియర్ పంచాయతీ గ్రామ కార్యదర్శుల డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని రాంపూర్‌తండా సర్పంచ్ పాండునాయక్ అన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేసుకున్న వీరిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

సీఈఐఆర్‌తో రెండు మొబైల్స్ రికవరీ

- బాధితులకు అప్పగించిన పోలీసులు
- ఫోన్ పోగొట్టుకున్నా.. చోరీ అయినా ఫిర్యాదు చేయాలి: పోలీసులు



మోమిన్‌పేట: స్వప్నకు మొబైల్ అందజేస్తున్న ఎస్ఐ విజయ్‌ప్రకాశ్



యాలాల: ఇర్ఫాన్‌కు ఫోన్ అందజేస్తున్న రూరల్ సీఐ, ఎస్ఐ అరవింద్

మోమిన్‌పేట: సీఈఐఆర్ అప్లికేషన్‌తో దొంగలు ఎత్తుకుపోయిన, పోగొట్టుకున్న ఫోన్ జాడ తెలుసుకోవడమే కాదు.. దాన్ని పట్టుకోవచ్చునని ఎస్ఐ విజయ్‌ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం మాట్లాడారు. మర్పల్లి మండలం రావులపల్లి, తిమ్మాపూర్ పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 29న విధులు నిర్వహించేందుకు వికారాబాద్ నుంచి వెళ్తుండగా.. మొరంగపల్లి రైల్వే అండర్‌పాసు బ్రిడ్జి వద్ద బైకు అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో రావులపల్లి జీపీ కార్యదర్శి స్వప్న ఫోన్ పడిపోయింది. కొంత దూరం వెళ్లాక ఫోన్ లేకపోవడం గమనించి, మోమిన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా అటుగా వెళ్తున్న వ్యక్తులు ఫోన్ తీసుకెళ్లినట్లుగా గుర్తించి, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆదివారం స్వప్నకు మొబైల్ అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ఫోన్ పోగొట్టుకున్న, చోరీ అయినా ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఫోన్ రికవరీ

యాలాల: పోగొట్టుకున్న ఫోన్‌ను రికవరీ చేసిన సంఘటన ఆదివారం యాలాలలో చోటుచేసుకుంది. ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. అగ్గనూరు గ్రామానికి చెందిన ఇర్ఫాన్ అనే యువకుడు నెలరోజుల క్రితం తన ఫోన్ పోగొట్టుకొని ఠాణాలో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్‌తో ఫోన్ జాడ కనిపెట్టారు. అనంతరం రూరల్ సీఐ రాంబాబు ఆదివారం బాధితుడికి ఫోన్ అందజేశారు.

వైభవంగా వాసవీమాత ఉత్సవాలు



అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



అమ్మవారి పల్లకీసేవలో పాల్గొన్న సంఘం సభ్యులు

కొడంగల్ రూరల్: కొడంగల్ పట్టణంలో ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరీ మాత ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి నగరేశ్వర స్వామి ఆలయం వరకు అమ్మవారి పల్లకీసేవ చేపట్టారు. మహిళల కోలాటం.. భక్తుల భజనల మధ్య పల్లకీసేవ కొనసాగింది. అనంతరం నగరేశ్వరస్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఒడిబియ్యం, ధూప దీప నైవేద్యాలు సమర్పించి మంగళహారతులు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ మాత మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌కు సన్మానం

మొయినాబాద్: రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ కారుకొండ కిరణ్‌కుమార్‌ను ఆదివారం ఇండియన్ లీగల్ అడ్వకేట్ ప్రొఫెషనల్ అసోసియేషన్(ఐఎల్‌పీఏ) ఆధ్వర్యంలో సన్మానించారు. మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఎల్బీనగర్‌లోని సమతాభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎల్‌పీఏ సభ్యునిగా ఉండి బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీగా ఎన్నికై న సందర్భంగా కిరణ్‌కుమార్‌ను సన్మానించారు. అదే విధంగా ఐఎల్‌పీఏ ద్వారా ఎన్నికైన జూనియర్ సివిల్ జడ్జీలకు, హైకోర్టు ఏజీపీగా నియమితులైన విష్ణువర్ధన్, బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఎన్నికైన న్యాయవాదులకు, ఫ్యాకల్టీకి సన్మానం చేశారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జీ జస్టిస్ సూరేపల్లి నంద, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ డైరెక్టర్ సుధారాణి, జర్నలిస్టు మల్లేపల్లి లక్ష్మయ్య, ఐఎల్‌పీఏ అధ్యక్షుడు పొన్నం దేవరాజుగౌడ్, సీనియర్ అడ్వకేట్‌లు సామ్‌సన్, వెంకట్‌రెడ్డి, గంగీడు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు

బొంరాస్‌పేట: రెండు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న పదో తరగతి విద్యార్థులు ఏకమై అ'పూర్వ' సమ్మేళనం జరుపుకొన్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంబురం చేసుకున్నారు. దుద్యాల మండల పరిధిలోని హకీంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02లో టెన్త్ పూర్తి చేసుకున్న వీరు.. నాడు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని నాటి విద్యార్థులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, రాఘవేందర్ యాదవ్, శ్రీనివాస్, ఆంజనేయులు, మునికుమార్, నరసింహ, సాయిలు, దామోదర్ రెడ్డి, సామ్యానాయక్, ప్రభాకర్, వెంకటేశ్, పెంటయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన ఉపాధ్యాయులు

పూడూరు: సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం మధు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కడుమూరు ప్రాథమిక పాఠశాలలో సమ్మర్ రీడింగ్ క్యాంపును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వేసవిలో విద్యార్థుల సమయం వృథా కాకుండా పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇందులో ఐదు ప్రత్యేక అంశాల్లో తర్ఫీదు ఇస్తామని, అందులో ధ్యానం చేస్తూ ఏకాగ్రతను అలవర్చుకోవడం, భాషా నైపుణ్యాలు, కథలు, పఠనా సామర్థ్యాలను పెంపొందించడం, గణితంలో మెలకువలు, ఆటల ద్వారా శారీరక, మానసికంగా ఎదిగేలా నేర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆధ్యాత్మిక, యోగా పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అఫ్జల్, ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు అఖిల, కృష్ణ, విఠల్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలతో తాగునీరు కలుషితం



కలుషితం అవుతున్న తాగునీరు

షాబాద్: తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలతో కలుషితమవుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. 6నెలలుగా మండల కేంద్రంలో ముంబాయి–బెంగళూరు లింక్ జాతీయ రహదారి పక్కనే మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ నీరంతా వృథాగా పోవడమే కాకుండా.. తాగునీరు కలుషితమవుతుందని, ఇదే విషయం అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా షాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో రహదారి పక్కనే మిషన్‌భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చేతివాటం ఎమ్మెల్యేలపై వేటు వేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను సీఎం కేసీఆర్ వెంటనే బర్తరఫ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత కుటుంబాలకు అందజేస్తున్న దళితబంధు పథకంలో ఎమ్మెల్యేలు కమీషన్ తీసుకున్నారని సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించారని చెప్పారు. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్క ఎమ్మెల్యే ఖండించ లేదంటే అవినీతి జరిగిందని ఒప్పుకున్నట్లే అవుతుందన్నారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజలను మోసం చేసినట్లే అవుతుందని, దళితబంధులో చేతివాటం చూపిన వారిపై వేటు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ ప్రకాష్ మాదిగ, నాయకులు అజయ్, మధు, చరణ్, రాందాస్, నర్సప్ప, శ్రీశైలం పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తాం

ఆ పార్టీ నాయకుడు భీంభరత్

షాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో లోకసభ మాజీ స్పీకర్ మీరాకుమారికి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. మర్యాదపూర్వకంగా ఆమెను కలిసినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెట్టి పరిపాలన సాగిస్తుందని ఆరోపించారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నియంత పాలన సాగుతుందని, నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీతోనే అందరికీ సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. డీసీసీ జనరల్ సెక్రటరీ భార్గవరామ్ పాల్గొన్నారు.

గుంతల రోడ్డులో ప్రయాణం ఎలా?



రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

పెద్దేముల్: మండలంలోని పలు రహదారులు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారిలో అనేక గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. చిన్న పాటి వర్షానికే.. నీరు గుంతల్లో చేరి ప్రమాదాలకు దారి తీస్తోంది. బుద్దారం వాగు వద్ద నెల రోజుల క్రితం రోడ్డుపై గుంత కారణంగా జీపు, బైకు ఢీ కొని ఇద్దరు మృత్యువాత పడ్డారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం ఎలా అని, ప్రమాదాలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతుకు చొరవ చూపడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డును బాగు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.